# ఘనంగా మేడే వేడుకలు

- కార్మిక జెండాను ఆవిష్కరించిన నాయకులు, కార్మికులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 1: కార్మిక దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అలంబిస్తున్నదని నాయకులు మండిపడ్డారు. కార్మికులకు ఎనిమిది గంటల పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులతోపాటు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్కిక్యాంప్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు ముఖ్య అతిథిగా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హాజరయ్యారు. కార్మికులు ప్రభుత్వపరంగా అందే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా ఇబ్బందులుంటే సంబంధిత అధికారులకు నివేదించాలని సబ్ కలెక్టర్ సూచించారు. బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ హాజరై పలువురు హమాలీలకు సన్మానాలు చేశారు.


బోధన్ చెక్కిక్యాంప్‌లో మేడే వేడుకలకు హాజరైన బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో


మోర్తాడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు


తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న పట్టణ సీఐ వెంకట నారాయణ


మాక్లూర్ మండలంలోని ఐఎంఎల్ డిపో కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న కార్మిక సంఘ నాయకులు


భీమ్‌గల్‌లో మేడే జెండాను ఆవిష్కరణ..



జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ..

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

వర్ని/ చందూర్, మే 1: వర్ని, చందూర్, రుద్రూర్, పొతంగల్ మండలాల్లో పలువురికి మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వర్ని సీడీసీలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. వర్ని మండలంలో 30, చందూర్‌లో 16, రుద్రూర్‌లో 51, పొతంగల్ మండలంలో 50మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు నారోజి గంగారాం, అంబర్‌సింగ్, ఏఎంసీ చైర్మన్ సురేశ్‌బాబా, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, రుద్రూర్ మండల అధ్యక్షుడు అరుణ్, నాగేందర్, సీనియర్ నాయకులు పత్తిరాము, సాయారెడ్డి, రాంరెడ్డి, చందూర్ తహసీల్దార్ శాంత తదితరులు పాల్గొన్నారు.

## ఆవులకు వ్యాక్సినేషన్


ఆవులకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి

చందూర్, మే 1: చందూర్‌లోని శివయ్య గోశాలలో ఉన్న ఆవులకు జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు బస్వారెడ్డి, సతీశ్, గోశాల అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నికుమార్

ఖలీల్‌వాడి, మే 1: నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఫౌండేషన్ చైర్మన్ సన్నికుమార్ మాట్లాడుతూ.. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు.

## జీపీ రికార్డుల తనిఖీ

ఖలీల్‌వాడి(మోపాల్), మే 1: మండలంలోని ముదక్‌పల్లి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి డి.శ్రీనివాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో చెత్త సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, వైకుంఠ ధామాన్ని సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయనవెంట ఎంపీవో కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు సురేశ్, వెంకటేశ్, మృదుల, పద్మజ, కారోబార్ శ్రీనివాస్ ఉన్నారు.


జీపీ రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో శ్రీనివాస్

## సమ్మర్ ఫెలోషిప్‌నకు ఎంపిక.. అభినందనీయం


సాయివర్ధన్, విశ్వేశ్వరిని అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, మే 1: విద్యార్థులు సమ్మర్ ఫెలోషిప్‌నకు ఎంపికకావడం అభినందనీయమని టీయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. ఫెలోషిప్‌నకు ఎంపికైన విద్యార్థులను ఆయన వర్సిటీలో గురువారం అభినందించారు. అంతరిక్ష శాస్త్రవేత్తగా ఎదగాలని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి సింగని సాయి వర్ధన్‌కు రిజిస్ట్రార్ సూచించారు. యూనివర్సిటీలోని ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ చదువుతున్న సాయి వర్ధన్.. బెంగళూరులోని ఇస్రో అనుసంధాన ఆస్ట్రో ఫిజిక్స్ లేబరేటరీలో అంతరిక్ష శాస్త్రంలో పరిశోధన చేయడానికి సమ్మర్ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యాడని తెలిపారు. ఆయన ఫెలోషిప్‌నకు ఎంపిక కావడం యూనివర్సిటీకే గర్వకారణమన్నారు. లోతైన పరిశోధనలు చేసి అంతరిక్ష శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రాసెస్ కెమిస్ట్రీలో పరిశోధనలు చేయడానికి వర్సిటీలోని ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో 8వ సెమిస్టర్ చదువుతున్న విశ్వేశ్వరీ ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను రిజిస్ట్రార్ యాదగిరి ప్రత్యేకంగా సన్మానించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న విభాగాధిపతులను ఆయన అభినందించారు.

## మైనార్టీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి, మే 1: కోటగిరిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ(బాలుర)లో 2025-2026 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ ఫస్ట్ ఇయర్ ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 శాతం(60) సీట్లు మైనార్టీలు, 25 శాతం(20) బీసీ-10, ఎస్సీ-4, ఎస్టీ-4, ఓసీ-2 సీట్లు మైనార్టీయేతర విద్యార్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కాలేజీలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4:30గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మే ఒకటో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉన్నదని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9154365020, 9493040786 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జూన్ రెండు నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

## డీలక్స్ బస్సుల్లో పది శాతం రాయితీ

ఖలీల్‌వాడి, మే 1: నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్లే ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో పది శాతం రాయితీ కల్పించినట్లు టీజీ ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు ఉన్నతస్థాయి ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు, సురక్షితంగా గమ్యాన్ని చేర్చేందుకు వీలుగా ఈ అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కంఠేశ్వర్, మే 1: నగరంలోని డీ-4 సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సీజీఆర్ఎఫ్-2 నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్గాం, వినాయక్‌నగర్, నాగారం సెక్షన్లకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఏమైనా విద్యుత్ సమస్యలుంటే శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. పరిష్కార వేదికకు ముఖ్యఅతిథిగా నిజామాబాద్ సీజీఆర్ఎఫ్-2 చైర్మన్ ఎరుకల నారాయణ, అతిథులుగా కమిటీ సభ్యులు సలంద్ర రామకృష్ణ, లకావత్ కిషన్, సీజీఆర్ఎఫ్ ఫోర్త్ మెంబర్ మర్రిపల్లి రాజాగౌడ్ హాజరవుతారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పేకాట స్థావరంపై దాడి

సిరికొండ, మే 1: మండలంలోని చిన్నవాల్గోట్ గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబట్టారు. ఎస్సై రామ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడిచేసినట్లు తెలిపారు. పేకాడుతున్న ఏడుగురిని పట్టుకొని, వారి నుంచి రూ.ఐదు వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

ఇందల్వాయి, ఏప్రిల్ 1: మండలంలోని లింగాపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు వాగు వద్దకు వెళ్లి తరలించడానికి సిద్ధంగా ఉన్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఇసుక డంపుల వేలం


వేలం వేస్తున్న తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్

భీమ్‌గల్, మే 1: మండలంలోని బెజ్జోరా గ్రామంలో ఇటీవల రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపులను గురువారం తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో వేలం వేశారు. సుమారు 25 ట్రాక్టర్ల ఇసుక నిల్వలకు నిర్వహించిన ఈ వేలంలో ఏడుగురు పాల్గొన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ సమీర్ రూ.51 వేలకు ఇసుకను దక్కించుకున్నాడు. వేలం సొమ్ము మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేశాక ఇసును తీసుకెళ్లాలని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

బోధన్, మే 1: ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును ఈ నెల 3న శనివారం వరకు పొడిగించినట్లు బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 2025-2026 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆస్తిపన్నును ఏకమొత్తంలో చెల్లించినట్లయితే ఇచ్చే 5 శాతం రాయితీని కూడా ఈనెల 7వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఆస్తి పన్ను మొత్తంలో 5 శాతం రాయితీని పొందేందుకు పట్టణ ప్రజలు వెంటనే ఆస్తిపన్నును చెల్లించాలని ఆయన కోరారు.

## వంద శాతం లక్ష్యాన్ని సాధించాలి


ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏపీఎం శ్యామ్

ఏర్గట్ల, మే 1: మహిళా సంఘాలకు మహిళా శక్తి కార్యక్రమాలను అందించాలని, రుణాల పంపిణీ లక్ష్యాన్ని వంద శాతం సాధించాలని ఏపీఎం శ్యామ్ అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు వసంతమ్మ అధ్యక్షతన మండల సమాఖ్య జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ.. 2025-26 సంవత్సరానికి 321 సంఘాలు గాను లక్ష్యం రూ.19 కోట్ల 79 లక్షల 20 వేలు, స్త్రీ నిధి 2025-26 సంవత్సరానికి లక్ష్యం 3 కోట్ల 77 లక్షల రూపాయలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలిగా కుందెన లక్ష్మి, కార్యదర్శిగా బైండ్ల సునీత, కోశాధికారిగా మోత్కూరి లత ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు సంతోష్, నవీన్, స్త్రీ నిధి మేనేజర్ సరస్వతి, అకౌంటెట్ సుప్రియ, 13 గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి


బోధన్‌లో మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

శక్కర్‌నగర్, మే 1: బోధన్ పట్టణంలో నిత్యం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ట్రాఫిక్, పట్టణ సీఐలు చందర్ రాథోడ్, వెంకట నారాయణలు తెలిపారు. ముఖ్యంగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపవద్దని, హెల్మెట్ లేని ప్రయాణం కొనసాగించవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం నిర్వహించిన తనిఖీల్లో పలువురు మైనర్లకు సీఐలు కౌన్సెలింగ్ నిర్వహించారు. మేజర్ కాకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసుల నమోదు అవుతాయని, దీంతో భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారుతుందని, పోలీసులు మైనర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం పలువురు మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

**ఆర్మూర్‌లో..**

ఆర్మూర్‌టౌన్, మే1: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ చేశారు. పట్టణ ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్సై రఘుపతి మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి, భారీగా జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. వాహనాలు నడుపుతున్న ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై జరిమానాలు విధిస్తామని అన్నారు.

## ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నవీపేట, మే 1: మండలంలోని నిజాంపూర్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి సుమారు రూ.8 లక్షల విలువైన 250 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి దొంగలు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్, ఆయిల్ ఎత్తుకెళ్లారు. ఎస్సై వినయ్ కథనం ప్రకారం.. మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న నిజాంపూర్ చిన్న తరహా ఎత్తిపోతల పథకం ఫస్టు స్టేజ్ వద్ద లిఫ్టునకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. వాటిలో కాపర్ వైర్లతో పాటు ఆయిల్‌ను దొంగిలించుకొని పారిపోయారని అన్నారు. నిజాంసాగర్ డి/50 కెనాల్ నిజాంపూర్, లింగాపూర్ బినోలా గ్రామాల పరిధిలో 1600 ఎకరాలకు ఈ లిఫ్టు ద్వారా సాగునీరం దుతున్నది. లిఫ్టు ఏఈ ప్రణయ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**రైతుల ఆందోళన**

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ చోరీకావడంతో రైతులు ఆందోళనకు గురువుతున్నారు. నెల రోజుల్లో ఖరీఫ్ పనులు ప్రారంభ మయ్యే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికావడంతో పంటల సాగుఎలా అని అంటున్నారు. అనుభవం ఉన్న దొంగలే ఈ ఘటుకానికి పాల్పడి ఉంటారని పలువురు భావిస్తున్నారు. బిహార్‌కు చెందిన దొంగల మూఠా జిల్లాలో పలు దొంగ తనాలకు పాల్పడుతున్నదని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ను పరిశీలిస్తున్న ఎస్సై వినయ్

## 'టెన్త్'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన


ఆర్మూర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్

ఆర్మూర్‌టౌన్, మే1: పట్టణంలోని పెర్కిట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎం శ్రీనివాస్ గురువారం తెలిపారు. పాఠశాలలో 43 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 43 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాల టాపర్‌గా జసేరా సిమ్రాన్ 547 మార్కులు, రెండో స్థానంలో అస్రీమ్ రియా 524 మార్కులు, మూడో స్థానంలో సృజన్ వర్మ 519 మార్కులు సాధించారని తెలిపారు. వీరిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పర్వీన్ సుల్తానా, వీడీసీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మండల టాపర్‌కు సన్మానం**

రుద్రూర్, మే 1: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలకు చెందిన శివానీ 577 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో రైడ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆమెతోపాటు ఉత్తమ మార్కులు సాధించిన మధుమతి, గౌతమిని గురువారం ఘనంగా సన్మానించారు. కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. తోటి విద్యార్థులు శివానీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, రైడ్స్ కమిటీ అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, సభ్యులు పత్తి రాము, మహిపాల్, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రుద్రూర్‌లో మండల టాపర్‌ను సన్మానిస్తున్న రైడ్స్ కమిటీసభ్యులు

## మూలన పడిన చెత్త సేకరణ వాహనాలు


కార్యాలయంలో చెత్త సేకరణ వాహనాలు

ఆర్మూర్‌టౌన్, మే1: గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆర్మూర్ మున్సిపాలిటీకి కొత్త చెత్త సేకరణ వాహనాలను కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్వహణ సరిగా లేక వాహనాలు మున్సిపాల్ కార్యాలయం ఆవరణలో మూలన పడ్డాయి. వాహనాలకు రిపేర్లు రావడంతో వ్యర్థాలు, చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం పడుతున్నది. నెలల తరబడి వాటిని బాగు చేయించడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఫలితంగా వార్డులో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ప్రజలు అంటున్నారు. వాహనాలు హనాలు వీధుల్లోకి సరిగా రాకపోవడంతో స్థానికులు చెత్తను సమీపంలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన, మురుగు కాలువల్లో వేస్తున్నారు. దీంతో వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. వాహనాలు రిపేరు చేసి వినియోగంలోకి తేవాలని పురపాలక సంఘం అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటిమట్టం

మోర్తాడ్, మే1: శ్రీరాంసాగర్‌లో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1060.90అడుగులు(11.44టీఎంసీలు)నీరునిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయకాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 382 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

## పశువులకు టీకాలు

మాక్లూర్, మే1: మండలంలోని వల్లభపూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యులు కిరణ్‌వేశ్‌పాండే తెలిపారు. తప్పని సరిగా రైతులు తమ పాడి పశువులకు టీకాలు వేయించాలని, దీంతో పశువుల పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని, పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వీఆల్‌వో వినీత, జేవీవో కల్యాణి, వీఏ అహ్మద్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన వ్యర్థాలు



ఫారెస్ట్ డివిజనల్ ఆఫీస్‌కు వెళ్లే దారిలో పడవేసిన వ్యర్థాలు

ఆర్మూర్‌టౌన్, మే1: పట్టణంలోని ఫారెస్ట్ డివిజన్ ఆఫీస్‌కు వెళ్లే దారిలో వ్యర్థాలు పడవేస్తున్నారు. దారి పొడువునా వ్యర్థాలతో నింపిన సంచులే దర్శనమిస్తున్నాయి. మున్సిపల్, అధికారులు స్పందించి వ్యర్థాలు పడవేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రోడ్డుకు ఇరువైపులా చెట్లు.. ప్రయాణికులకు ఇక్కట్లు


మూల మలుపు వద్ద రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

ఏర్గట్ల, మే1: మండల కేంద్రం నుంచి తొర్తి గ్రామానికి వెళ్లే దారిలో గ్రామ శివారులో నల్ల చెరువు కట్ట కింద ఉన్న రహదారికి ఇరువైపులా చెట్లు అడ్డంగా పెరిగాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందుల పడుతున్నారు. ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూల మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో ఎదురుగా వచ్చిన వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో రెండు సార్లు ట్రాక్టర్లు బోల్తా పడ్డాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.